నేటి నుంచి మిర్చి కొనుగోళ్లు

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం నుంచి మిర్చి కొనుగోళ్లు జరుగుతాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మోగిన బడిగంట..



సత్తుపల్లిరూరల్: సిద్ధారంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్

బడిగంట మోగింది. వేసవి సెలవులు ముగిసిన అనంతరం మళ్లీ బడులు తెరుచుకున్నాయి. బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతుండడంతో విద్యార్థులు బడి బాట పట్టారు. పిల్లల రాకతో పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది. తొలిరోజే విద్యార్థులకు యూనిఫాం, బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు దీటుగా సర్కార్ పాఠశాలల్లో విద్యాబోధన ఉంటుందని.. పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కొణిజర్ల: పెద్దగోపతి ఉన్నత పాఠశాలలో.. పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్



తల్లాడ: కుర్నవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



ముదిగొండ జెడ్పీఉన్నత పాఠశాలలో..



ఏన్కూరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్



మధిర: బంజారా కాలనీలో..



వైరాలో చిన్నారులకు దుస్తులు, పుస్తకాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్



కల్లూరురూరల్: తూర్పు లోకవరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

చింతకాని: విద్య, వైద్య రంగాలతో పాటు సాగు నీటి ప్రాజెక్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. మండలంలోని వందనం, రేపల్లెవాడ, పాతర్లపాడు గ్రామాల్లో రూ. 18.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్ల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులందరూ రాష్ట్రాభివృద్ధి కోసం అంకితబావంతో పనిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో పెద్దఎత్తున్న నిధులను కేటాయించిందని.. దీనిలో పైలట్ ప్రాజెక్ట్‌గా చింతకాని మండలంలో పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నియోజవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. పాతర్లపాడు గ్రామంలో పలు పార్టీల నుంచి భట్టి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరగా భట్టి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్ దత్, ఎంపీపీ పూర్ణయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు భాస్కర్, నాగేశ్వరరావు, ప్రసాదరావు, పిచ్చయ్య పాల్గొన్నారు.



బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మల్లు భట్టివిక్రమార్క, కలెక్టర్ గౌతమ్, తదితరులు

బస్సు సౌకర్యం కల్పించాలి

కొణిజర్ల: కొణిజర్ల మండలం అంజనాపురం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మండలంలోని గుబ్బగుర్తి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు టీజీ ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ప్రస్తుతం బస్సు సింగరాయపాలెం వరకు వస్తుందని, అంజనాపురం నుంచి గుబ్బగుర్తి ఉన్నత పాఠశాలకు నిత్యం 30మంది బాల బాలికలు వస్తున్నందున బస్సును అంజనాపురం వరకు పొడిగించాలని కోరారు. హెచ్ పమ్మి శివనారాయణ, అమ్మ అదర్శ కమిటీ చైర్మన్ నాగమణి పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వైరా: వైరా ఐదో వార్డుకు చెందిన షేక్ గౌస్‌పాషా ఇంట్లో చోరీ జరిగింది. పాషా కుటుంబంతో సహా వైద్యపరీక్షల నిమిత్తం మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. అయితే బుధవారం ఉదయం ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని చూసిన స్థానికులు యజమానికి సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులకు తెలపగా సిబ్బంది అక్కడకి చేరుకుని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు..

పెనుబల్లి: ద్విచక్రవాహనం, కారు ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా రామచంద్రపురం గ్రామానికి చెందిన మరీదు నాగరాజు ద్విచక్రవాహనంపై బుధవారం పెనుబల్లి వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈక్రమంలో సీతారామపురం వద్ద జాతీయ రహదారిపై కారు ఢీకొట్టగా నాగరాజుకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ఆయనను పెనుబల్లి ఆస్పత్రిలో చికిత్స అనంతరం తిరువూరుకు తరలించారు.

నియామకం..

కల్లూరు: సీడీపీఓగా ఎస్కే మెహర్నిశాభేగం బుధవారం బాధ్యతలు చేపట్టారు. కల్లూరు సీడీపీఓ కృష్ణకుమారి ఇటీవల పదవీ విరమణ చేయగా, ఆ స్థానంలో పెనుబల్లి సీడీపీఓ ఎస్కే మెహర్నిషాభేగం ఎఫ్ఏసీ బాధ్యతలు చేపట్టారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

వైరా: పోరాటాల ద్వారానే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం వైరాలోని మధు విద్యాలయంలో నిర్వహించిన సీపీఐ రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. అనంతరం నూతన ఆర్థిక విధానాలు గురించి చలమల విఠల్ బోధించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు రాంబాబు, పట్టణ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

జలగం వెంగళరావు సేవలు చిరస్మరణీయం

సత్తుపల్లి/పెనుబల్లి: జిల్లాకు, రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు వర్ధంతి సందర్భంగా బుధవారం సత్తుపల్లిలోని జేవీఆర్ పార్కులోని ఆయన కాంస్య విగ్రహానికి, పెనుబల్లిలోని గంగదేవిపాడులో ఆయన విగ్రహానికి, వీయంబంజర్ రింగ్ సెంటర్‌లో గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, ఎండి కమల్‌పాషా, పింగళి సామేలు, అప్పారావు, రవీందర్‌రెడ్డి, యోహాన్, గఫార్‌ఖాన్, సందీప్‌గౌడ్, మారుతి, రమేష్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వరరావు, రామారావు, వెంకటేశ్వరరావు, కాంతయ్య, పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి

తల్లాడ: విత్తన దుకాణాల డీలర్లు రైతులకు ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఏడీఏ నరసింహారావు అన్నారు. బుధవారం తల్లాడ, మిట్టపల్లి గ్రామాల్లోని విత్తనాలు, పురుగు మందులు మరియు ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఏఓ ఎండి.తాజుద్దీన్, తల్లాడ క్లస్టర్ ఏఈఓ గురుమూర్తి, మిట్టపల్లి ఏఈఓ డి.నరేష్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ అమలుపై అధికారుల సర్వే

సత్తుపల్లిరూరల్: మిషన్ భగీరథ పథకం అమలుపై సత్తుపల్లి మండలంలో అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చిన్న నాగేశ్వరరావు మండల వ్యాప్తంగా పర్యటించి.. యాప్‌లో వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కృష్ణ ఉన్నారు.

బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని అల్లు దేవదాస్, పసుపులేటి సుజాత ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. వీరి పేరిట తక్కెళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో గ్రూపు ఇన్సూరెన్స్ ఉండడంతో ఒక్కొక్కరికీ రూ.50 బీమా నగదు మంజూరైంది. ఈ నగదును నామినీలకు బుధవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, బ్యాంక్ మేనేజర్ రాంబాబుతో కలిసి అందించారు. అసిస్టెంట్ మేనేజర్ సంధ్య, సూపర్ వైజర్ మహేష్, సీఈఓ ఎం.కృష్ణ, సొసైటీ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

మధిర/బోనకల్: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు కోట వెంకట్ తెలిపారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మధిర పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బోనకల్ మండల కేంద్రంలో ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో.. పలు గ్రామాల్లోని తల్లులతో ర్యాలీ, పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించారు. బాల కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కన్నెపోగు వెంకటేశ్వర్లు, నిస్సి హారిణి, పంచాయతీ కార్యదర్శులు, ఎఫర్ట్ సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.